సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

చతికిల బడి



అర్పీ పేట జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు(ఫైల్)

నాడు

గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం.. సర్కారు విద్యకు అధిక ప్రాధాన్యమిచ్చింది. డిజిటల్ విద్యను ప్రోత్సహించింది. మన బడి నాడు–నేడు కార్యక్రమం కింద లక్షలాది రూపాయల నిధులతో సర్కారు బడుల రూపురేఖలను అద్భుతంగా మార్చివేసింది. ఉత్తర నియోజకవర్గంలో మొత్తం 20 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. అందులో 17 జీవీఎంసీ స్కూళ్లు నాడు–నేడుకు ఎంపిక య్యాయి. వీటిలో అన్ని వసతులు, అదనపు భవనాలు, తరగతి గదులు, టాయిలెట్లు, నిరంతర నీటి సరఫరా, ఆర్వో వాటర్ వంటి ఎన్నో సదుపాయాలు కల్పించారు. అమ్మ ఒడి, విద్యా కానుక, గోరుముద్ద వంటి సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేశారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పిల్లల చదువులు సాఫీగా సాగేలా తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా లభించింది.

నేడు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దయనీయంగా మారింది. రెండు నెలలు కావస్తున్నా.. విద్యకు ఎటువంటి ప్రాధాన్యం ఇవ్వలేదు. విద్యాభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన మధ్యాహ్న భోజన పథకం, విద్యా కానుక పంపిణీ పేర్లు మార్చి అలాగే కొనసాగిస్తున్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అందరికీ తల్లికి వందనం పేరిట ఏటా రూ.15 వేల చొప్పున అందిస్తామన్న హామీ నేటికీ అమలు కాలేదు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత అధికంగా ఉంది. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థులు చదువులు మసకబారుతున్నాయి.

- ప్రభుత్వ స్కూళ్లను వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- సమస్యల మధ్య విద్యార్థుల చదువులు
- పాఠశాలల స్థితిగతులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం

సీతంపేట/కంచరపాలెం: ఉత్తర నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు టీచర్లు లేకపోవడంతో బోధన కష్టతరంగా మారింది. ముఖ్యమైన సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులతోపాటు వివిధ విభాగాల సిబ్బందిని పలు పాఠశాలల్లో నియమించాల్సి ఉంది.

ఉర్దూ పాఠశాలలో టీచర్లు అవసరం

జీవీఎంసీ 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలో వందేళ్ల చరిత్ర గల ఉర్దూ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో 7, 8 తరగతులకు పాఠాలు బోధించడానికి ఉపాధ్యాయులు లేరు. ఉన్న వారితోనే బోధన కొనసాగిస్తున్నారు. సోషల్, బయాలజీ, తెలుగు, హిందీ సబ్జెక్టులు బోధించడానికి టీచర్ల అవసరం ఉంది. ప్రస్తుతం 10 మంది ఉపాధ్యాయులు ఉండగా.. మరో నలుగురిని నియమించాల్సి ఉంది. పాఠశాలలు ప్రారంభమై 45 రోజులు గడిచినా.. ఉపాధ్యాయిల నియామకంపై ప్రభుత్వ యంత్రాంగం దృష్టి సారించలేదు.



ముస్లిం తాటిచెట్లపాలెంలోని జీవీఎంసీ ఉర్దూ అప్పర్ ప్రైమరీ స్కూల్

తగ్గిన విద్యార్థుల సంఖ్య..

టీచర్ల కొరతతో ఉర్దూ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య బాగా తగ్గింది. గతేడాది 360 మంది విద్యార్థులు ఉండగా.. ఈ ఏడాది 328 మంది చదువుతున్నారు.

ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్‌లో..

26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో గత నెలలో ఒక ఉపాధ్యాయిని పదవీ విరమణ చేశారు. ఆమె స్థానంలో మరో టీచర్‌ను నియమించాల్సి ఉంది. సోషల్ టీచర్, హిందీ పండిట్ అవసరం ఉంది.

మధురానగర్ ప్రాథమిక పాఠశాలలో..

25వ వార్డు మధురానగర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య బాగా తగ్గింది. గతేడాది 222 మంది విద్యార్థులు ఉండగా.. ఈ ఏడాది 188 మంది మాత్రమే ఉన్నారు. ఉపాధ్యాయులు అవసరమున్న పాఠశాలల్లో వెంటనే నియామకాలు చేపట్టాలని పలువురు విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి



ముస్లిం తాటిచెట్లపాలెంలో జీవీఎంసీ ఉర్దూ పాఠశాల స్థాపించి వందేళ్లు దాటిపోయింది. అటువంటి పాఠశాలలో ఉపాధ్యాయులు సరిపడా లేక బోధనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 7, 8 తరగతులకు పాఠాలు బోధించడానికి టీచర్లు లేరు. సోషల్, బయాలజీ, తెలుగు, హిందీ సబ్జెక్టులు బోధించడానికి ఉపాధ్యాయుల అవసరం ఉంది. ప్రభుత్వం స్పందించి వెంటనే ఉపాధ్యాయులను నియమించాలి.

– మహబూబ్ నిషా, ఎంటీసీ పాలెం

అరకొరగా విద్యా కానుక



పాఠశాల తెరిచి 45 రోజులు గడిచిన తరువాత యూనిఫారం ఇచ్చి త్వరగా కుట్టించుకోమని పిల్లలపై ఉపాధ్యాయులు ఒత్తిడి తెస్తున్నారు. విద్యా కానుకలు అరకొరగా, చాలీచాలని సైజుల్లో బూట్లు పంపిణీ చేశారు. యూనిఫారం కుట్టించుకునేందుకు డబ్బులు లేని పరిస్థితి. గతంలో అమ్మ ఒడి డబ్బులు వేస్తే పిల్లలకు కావలసిన అన్ని రకాలు కొనుగోలు చేసేదానిని.

– ఎస్.దేవి, పేరెంట్, కంచరపాలెం

నెహ్రూ ఉన్నత పాఠశాలలో సమస్యలు



పీఅండ్‌టీ కాలనీలోని ఎన్ఎంసీ హైస్కూల్

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని జీవీ ఎన్ఎంసీ హైస్కూల్ ప్లస్–2లో సుమారు 1,100 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ ఆరు నుంచి పదో తరగతి, ఇంటర్మీడియట్ వరకు విద్య బోధిస్తున్నారు. హెచ్ఎంతోపాటు మొత్తం 29 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఫిజికల్ డైరెక్టర్(పీఈటీ) పోస్టు ఖాళీగా ఉంది. విద్యార్థులను ఆటలు ఆడించేందుకు టీచర్ లేరు. ఈ స్కూల్‌లో ఐదేళ్లుగా ఆఫీస్ క్లర్క్ లేకపోవడంతో సబ్జెక్ట్ ఉపాధ్యాయులే ఆ పనిచేస్తున్నారు. కంప్యూటర్ ఆపరేటర్ కూడా లేరు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

క్లుప్తంగా

కాలభైరవుడికి పూజలు



అలంకరణలో కాలభైరవ స్వామి

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీమహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయి బాబా దేవాలయంలో కొలువైన కాలభైరవుడికి అమావాస్య సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో అర్చక బృందం వంశీ పంచామృతాభిషేకం, భక్తుల గోత్ర నామాలతో పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో కాలభైరవ స్వామి దర్శనమిచ్చారు. గుమ్మడి కాయ చెక్కల్లో భక్తులు నెయ్యి దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు.

లలితా పీఠంలో ప్రత్యంగిరా భద్రకాళి హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

అక్కయ్యపాలెం: లలితానగర్ శ్రీలలితా పీఠంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ఆదిపరాశక్తి అనుగ్రహం పొందేందుకు శ్రీప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి అనుగ్రహంతో పండితులు శాస్త్రోక్తంగా హోమం జరిపారు. భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ భక్తుల కోరిక మేరకు లలితా పీఠంలో ప్రతి అమావాస్య రోజూ ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

నవ్వులు పంచిన వినోదాల విందు



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ నిర్వహించిన వినోదాల విందు కార్యక్రమం ఆద్యంతం నవ్వులు పండించింది. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ కళాకారులు పలు కామెడీ స్కిట్లు ప్రదర్శించి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. వీటిలో గొట్టం గాడు, నో వేకన్సీ, రామాయణం సినిమా, పక్కింటి ఆంజనేయులు, మామ అల్లుడు, జ్యోతిష్యం, నోములు వ్రతాలు, లవర్స్ పార్క్, డైలీ పేపర్, ఏడు వారాలు, షాపింగ్ స్కిట్స్ ఆహుతులను అలరించాయి. జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, కుమారి, రావి గోపీకృష్ణ, భానుప్రకాష్, శివజ్యోతి, ఇమంది ఈశ్వరరావు, రమ స్కిట్లు ప్రదర్శించారు.

ఉత్సాహంగా జాతీయ స్థాయి కరాటే పోటీలు

పెదగంట్యాడ: అమరపిని యాస్సెంట్ షాటో కాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బీసీ రోడ్డులోని అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన 3వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో 9 రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున క్రీడాకారులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఆంధ్ర షాటో కాన్ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా తెలంగాణకు చెందిన డ్రాగన్ షాటో కాన్ కరాటే డూ స్పోర్ట్స్ ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు బహుమతులు అందజేశారు. పోటీలను గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు ప్రారంభించారు. అమరపిన్ని నరేంద్ర, అమరపిన్ని మనోహర్ సాయి పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
8309817091
సాక్షి

బ్రాహ్మిణ్ వ్యాపారులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న చెరువు రామకోటయ్య



హాజరైన బ్రాహ్మిణ్ వ్యాపారస్తులు

సీతంపేట: బ్రాహ్మణ వ్యాపారవేత్తలకు పరస్పర సహకారం అందజేయడం, యువ బ్రాహ్మణ వ్యాపారవేత్తలకు మెరుగైన సలహాలు, సూచనలు అందించి వారి వ్యాపారాభివృద్ధికి తోడ్పడటమే లక్ష్యంగా బిజినెస్ బై బ్రాహ్మిణ్ పనిచేస్తోందని సంస్థ గౌరవ అధ్యక్షుడు చెరువు రామకోటయ్య తెలిపారు. శంకరమఠంలో ఆదివారం జరిగిన బిజినెస్ బై బ్రాహ్మిణ్ విశాఖ చాప్టర్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సమాజంలో నిబద్ధత, నిజాయితీగా వ్యాపారం చేసి అందరి మన్ననలు పొందాలని వ్యాపారులకు సూచించారు. వ్యాపారం ప్రారంభించాలనుకునే ఔత్సాహికులు, బ్రాహ్మణ చిరు వ్యాపారులకు బిజినెస్ బై బ్రాహ్మిణ్ అండగా నిలుస్తుందన్నారు. వ్యాపారానికి కావలసిన మౌలిక సదుపాయాలు, ఆర్థిక వనరులు, వ్యాపారాభివృద్ధిపై సమగ్ర అవగాహన కల్పించి సహాయం అందిస్తామని చెప్పారు. సంస్థ ప్రెసిడెంట్ ధవళ మధుసూదనరావు, సెక్రటరీ పరిమి నాగేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో అధిక సంఖ్యలో బ్రాహ్మణ వ్యాపారవేత్తలు, ఔత్సాహిక వ్యాపారవేత్తలు పాల్గొని తమ వ్యాపార వివరాలు వెల్లడించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో పాల్గొన్న జీవీసీఎఫ్ ప్రతినిధులు

సీతంపేట: విశాఖ నగర ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని గ్రేటర్ విశాఖపట్నం సిటిజన్స్ ఫోరం(జీవీసీఎఫ్) ప్రతినిధులు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంస్థ అధ్యక్షుడు ఎ.కె.సుబ్బారావు మాట్లాడుతూ విశాఖ ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను గుర్తించామన్నారు. ముఖ్యంగా వాయు, జల, శబ్ద కాలుష్యం, పచ్చదనం పునరుద్ధరణ, మడ అడవులతో కూడిన పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ, తీరప్రాంత క్రమబద్ధీకరణ, మురుగునీటి శుద్ధి సామర్థ్యం పెంపు, వర్షపు నీటి నిర్వహణ, ప్లాస్టిక్ కాలుష్య నివారణ, సహజ నీటి వనరుల రక్షణ, పౌరుల భూమి పరిరక్షణ, ట్రాఫిక్ సమస్య, ప్రజా రవాణా మెరుగుదల, వయోవృద్ధులు, దివ్యాంగులకు సౌకర్యాల కల్పన, వారసత్వ సంపద పరిరక్షణ, మురికివాడల్లో జీవితాన్ని మెరుగుపర్చడం, నగరాభివృద్ధికి తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. ప్రజల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా ప్రయత్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ టి.వి.నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ సోహన్ హటంగడి, సెక్రటరీ ఎస్.విశ్వనాథన్, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గీతం ఆస్పత్రిలో మృతుని బంధువుల ఆందోళన

- వైద్యుల నిర్లక్ష్యంతోనే భర్త చనిపోయాడని భార్య ఆరోపణ



ఆందోళన చేస్తున్న సురేష్ భార్య ఝాన్సీ, కుటుంబ సభ్యులు

కొమ్మాది: వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన భర్త చనిపోయాడంటూ ఓ మహిళ గీతం ఆస్పత్రిలో ఆందోళనకు దిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మధురవాడ స్వతంత్రనగర్‌కు చెందిన పంతం సురేష్(37) శనివారం ఉదయం ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతుండగా ఆయన భార్య ఝాన్సీ చికిత్స నిమిత్తం రుషికొండలో గల గీతం ఆస్పత్రిలో చేర్పించారు. ఆదివారం ఉదయం వరకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. రక్తం తక్కువగా ఉందని ఎక్కించారని, పరిస్థితి విషమంగా ఉందని ఆరోగ్య శ్రీకి దరఖాస్తు చేసుకోమని వైద్యులు సూచించినట్లు ఆమె తెలిపారు. అయితే అన్నీ అయిన తర్వాత ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు సురేష్ చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా జూనియర్ వైద్యులతో వైద్యం అందించారని, కనీసం రక్తం ఎక్కించడం కూడా చేతకాని జూనియర్ వైద్యులతో చికిత్స చేయించడం వల్లే తన భర్త చనిపోయాడంటూ ఝాన్సీ ఆరోపిస్తున్నారు. ఆమెతోపాటు కుటుంబ సభ్యులు ఆస్పత్రి ప్రాంగణంలో ఆందోళనకు దిగారు. ముమ్మాటికీ వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన భర్త చనిపోయాడని, ఇప్పుడు మృతదేహాన్ని ఇవ్వమంటే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆమె ఆరోపించారు. రెండు రోజులపాటు వైద్యం చేస్తున్నట్లు ఇక్కడి డాక్టర్లు హడావిడి చేశారని, ఉదయం నుంచి కోలుకుంటున్న వ్యక్తి సాయంత్రమయ్యేసరికి ఎలా చనిపోతాడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి మృతదేహాన్ని తీసుకెళ్లమని ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పీఎం పాలెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ఆసియన్ బాక్సింగ్ సెలక్షన్ ట్రయల్స్‌కు దీపిక



ఉక్కునగరం: ఆసియన్ బాక్సింగ్ సెలక్షన్ ట్రయల్స్‌కు స్టీల్‌ప్లాంట్ విద్యార్థిని కనక దీపిక ఎంపికయ్యారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 10 వరకు అబుదాబీ లోని ఎ1 ఏఈఎన్ సిటీలో ఏఎస్‌బీసీ ఆసియన్ జూనియర్ బాలురు, బాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్–2024 పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో అర్హత కోసం బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 11 వరకు రోహత‌క్‌లోని సాయ్‌లో సెలక్షన్ ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. జాతీయ డీఏవీ బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో రాష్ట్రస్థాయిలో బంగారు పతకం, సీబీఎస్ఈ సౌత్ జోన్ పోటీల్లో కాంస్యపతకం సాధించిన కనక దీపికను ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ సెలక్షన్ ట్రయల్స్‌కు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో దీపికను స్టీల్‌ప్లాంట్ బాక్సింగ్ కోచ్ కె. శ్రీనివాసరావు అభినందించారు.

సాటిలేనిది స్నేహబంధం



సీతమ్మధార: స్థానిక హోటల్‌లో ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు నిర్వహిస్తున్న స్వాతి ప్రమోటర్స్ ఎండీ మేడపాటి రమేష్‌రెడ్డి, స్నేహితుల బృందం

తాటిచెట్లపాలెం: అంతర్జాతీయ ఫ్రెండ్‌షిప్ డే వేడుకలను ఆదివారం స్నేహితులంతా కలిసి ఆనందగా.. సందడిగా జరుపుకున్నారు. చిన్ననాటి మిత్రులంతా ఓ చోట చేరి సరదాగా గడిపారు. జీవితంలో చివరి వరకు మిగిలేది స్నేహమేనని, చెలిమిలో కల్లాకపటం ఉండవని సాలగ్రామపురం పోర్టు హైస్కూల్ చిన్ననాటి స్నేహితులు రుజువు చేస్తున్నారు. పోర్టు హైస్కూల్ 1992 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. చిన్ననాటి నుంచి నేటి వరకు ఒకరి కష్టసుఖాల్లో ఒకరం పాలుపంచుకుంటూ స్నేహం కొనసాగిస్తున్నట్లు వీరు తెలిపారు. భీమిలోని గెస్ట్ హౌస్‌లో కలుసుకుని, భీమిలి బీచ్‌లో సందడిగా వేడుకలు జరుపుకున్నారు. స్నేహబంధం సాటిలేనిదని, శాశ్వతమైనదని చాటిచెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భద్రగిరిరావు(వైశ్యరాజు జ్యూయలరీ అధినేత), గొర్లె చందు(పోర్ట్ ట్రస్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు), డాక్టర్ తిరుపతిరావు, కేశవరావు, శ్రీను, రాజ్యలక్ష్మి, రాధ, సుందరి, శివగంగ, ఉమాబాల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు

రైల్వే గ్రౌండ్స్‌లో రైల్వే వాకర్స్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం నుంచి డాక్టర్ కేర్ హోమియో ఆయుర్వేదిక్ హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు వాకర్స్ పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం రైల్వే వాకర్స్ సభ్యులు కేక్ కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.



రైల్వే గ్రౌండ్స్‌లో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న వాకర్స్ సభ్యులు

స్నేహితుల సందడి

కంచరపాలెం: జ్ఞానాపురం సేక్రెడ్ హార్ట్ బాలికోన్నత పాఠశాలకు చెందిన 2001 టెన్త్ బ్యాచ్ విద్యార్థినులు ప్రతి ఏటా మాదిరిగానే స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్కే బీచ్ వద్ద నాటి స్నేహితులంతా కలిసి తమ పాత జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ సంతోషంగా గడిపారు. పూర్వ విద్యార్థులు పల్లా ప్రశాంతి, ఉజ్వల, భవాని, శ్రీవాణి, లీలా, హైమా, రత్నజ్యోతి, వరలక్ష్మి, నాగలక్ష్మి, సిరి, శాంతి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.



భీమిలి బీచ్‌లో పోర్టు హైస్కూల్ పూర్వ విద్యార్థుల సందడి



ఫ్రెండ్‌షిప్ డే వేడుకల్లో సేక్రెడ్ హార్ట్ హైస్కూల్ 2001 టెన్త్ బ్యాచ్ విద్యార్థినులు

'ఉదయ కిరణాలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య బాబివర్ధన్

సీతంపేట: రచయిత డాక్టర్ మీగడ శశిభూషణ స్వామి ఆటవెలదిలో అద్భుతమైన పదజాలంతో రచించిన ఉదయకిరణాలు శతకం ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకమని ఏయూ జర్నలిజం పూర్వ విభాగాధిపతి ఆచార్య పి.బాబివర్ధన్ అన్నారు. ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. భాషను, భావాన్ని సమన్వయం చేసుకుంటూ, సమాజాన్ని, మానవీయ కోణాన్ని తన రచనలో ఆవిష్కరించారన్నారు. సుమతీ శతకం, వేమన శతకంలా శశిభూషణ స్వామి రాసిన ఉదయకిరణాలు శతకం మంచి పేరును సంపాదిస్తుందని ఆకాంక్షించారు. సీనియర్ జర్నలిస్ట్ నాగబోయిన నాగేశ్వరరావు పుస్తక సమీక్ష చేశారు. సమాజంలోని ప్రతి అంశాన్ని తీసుకుని పద్య రూపంలో పొందుపర్చారన్నారు. పుస్తక రచయిత శశిభూషణ స్వామి మాట్లాడుతూ కరోనా సమయంలో బయటకు వెళ్లలేని పరిస్థితుల్లో సమాజానికి ఏదైనా చెయ్యాలన్న ఆలోచన శతక పద్యాలను రాసేలా చేసిందన్నారు. సెకాలజిస్ట్ డాక్టర్ జి.రాజేశ్వరరావు, రచయిత పి.చంద్రభూషణం, పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

శాకంబరిగా ఎర్నిమాంబ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారు ఆదివారం శాకంబరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గర్భాలయంలో అమ్మవారిని పలు రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. అర్చకుడు శ్రీకాంత్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని శాకంబరిగా అలంకరించినట్లు ఈవో సురేష్‌బాబా తెలిపారు.

స్నేహంతో శాంతి మార్గం



స్నేహితుల దినోత్సవంలో పాల్గొన్న బాలమోహన్‌దాస్, సుకుమారన్ తదితరులు

సీతంపేట: స్నేహంతోనే శాంతి వర్ధిల్లుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. వ్యక్తులు, దేశాలు, మతాలు, కులాల మధ్య తారతమ్యం లేకుండా స్నేహాన్ని పెంచుకోవడం ద్వారా శాంతి మార్గం సుగమమవుతుందన్నారు. అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.ఎస్.సుకుమారన్ అధ్యక్షతన బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ శ్రీకృష్ణుడు, కుచేలుడు మధ్య అద్భుతమైన స్నేహ సంబంధాన్ని పురాణాల్లో చూశామన్నారు. స్నేహ బంధాలు సమాజ అభివృద్ధికి కృషి చేయాలని, స్వార్థం లేని స్నేహాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. సుకుమారన్ మాట్లాడుతూ స్నేహ సంబంధాలు పెంపొందే విధంగా ఇస్కఫ్ కృషి చేస్తోందని చెప్పారు. అనంతరం ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి పి.కె.జోషి, కేరళ కళా సమితి అధ్యక్షుడు ఉన్ని కృష్ణన్, ఉత్కల్ కళా సమితి అధ్యక్షుడు జితేంద్రనాయక్, దేవరకొండ మార్కండేయులు, సన్‌మూర్తి, జి.సూర్యకుమారి, జె.రాంప్రభు, ఉప్పల అప్పలరాజు, కె.సత్యాంజనేయ, జె.కె.నాయక్, మధుమతి, సత్యవతి, సీతల్, ఇమంది పైడిరాజు, శ్యాంసుందర్, అహ్మద్ పాల్గొన్నారు.

హద్దు మీరితే చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ద్వారకా ఎస్ఐ ధర్మేంద్ర

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.రమేష్ ఆదేశాల మేరకు ఎస్ఐ ధర్మేంద్ర కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సమాజంలో హద్దు మీరి ప్రవర్తిస్తే చర్యలు తప్పవని రౌడీషీటర్లను హెచ్చరించారు. ఎటువంటి నేరాలు, కొట్లాటలు, గొడవల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని, మంచిగా నడుచుకోవాలని సూచించారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందంగా జీవించండి

ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు సీఐ ఎస్.విజయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. సమాజంలో ఎలాంటి అల్లర్లు, తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా ఉండాలని, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్లపై దినచర్యపై ఆరా తీశారు. అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.